అసమానతల అంతమే కెవిపిఎస్ లక్ష్యం

- మనువాదంతో దేశఐక్యతకు విఘాతం
- ఘనంగా 28 వ ఆవిర్భావ వేడుకలు
- ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న కుల, ఆర్థిక, సమానతలను అంతం చేయడమే కెవిపిఎస్ లక్ష్యంగా కృషి చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద కెవిపిఎస్ 28వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాల కలిగిన ఆ సంఘ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పూలమాలలేయగా, జ్యోతిబాపూలే చిత్రపటానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు ఎంవి రమణ, పి ఆశయ్య పూలమాలలతో ఘనంగా నివాళి అర్పించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేక అసమానతలు కుల రూపంలో ఈ దేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని చెప్పారు. వివక్షవల్ల దేశ పురోగతిలో వెనుకబడిపోయి, సాటి మనిషిని మనిషిగా చూడని నీచత్వం ఉందన్నారు. 78 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా నేటికీ గుడి, బడిలో వివక్ష కొనసాగడం బాధాకరమని అన్నారు. ఇది దేశ ప్రజల ఐక్యతకు అభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వ్యవస్థ, అసమానతలు సమర్థించే పాలకులు అధికారంలో ఉండటం వల్ల వివక్ష మరింత పెచ్చరిల్లుతున్నదని విమర్శించారు. యువతరం, విద్యావంతులు కుల నిర్మూలన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలతో పాటు సామాజిక అసమానతలు కూడా నిర్మూలించడం ద్వారా మాత్రమే పీడిత వర్గ ఐక్యత బలపడుతుందన్నారు. టి సాగర్ మాట్లాడుతూ కులవివక్ష, అంటరానితనం యూనివర్సిటీ స్థాయిలో కొనసాగుతున్నదని చెప్పారు. దళితులు దేవాలయాల్లోకి రానీయ్యకపోవడమేగాకుండా, పట్టణాలతో పాటు గ్రామ సీమల్లో నేటికీ బలంగా వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ 28 ఏండ్ల సామాజికోద్యమ ప్రస్థానంలో కెవిపిఎస్ ఎస్సీ, ఎస్టీ కమిషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, కులాంతర వివాహితులకు రూ. 2.50 లక్షల ప్రోత్సాహకాలు ఇచ్చే జీఓ నెం 12ని సాధించిందని గుర్తు చేశారు. ఇంకా అనేక విజయాలు సాధించామని చెప్పారు. కార్యక్రమంలో ఐవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం శోభన్, సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ సెక్రటరీ సైకం మనోహర్ రెడ్డి, పార్క్ మాజీ ప్రెసిడెంట్ అంబటి శ్రీనివాస్‌రెడ్డి, సరిపేట రమేష్‌రెడ్డి, రూపుల వివేక్ కంటోన్మెంట్ బోర్డ్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజేశ్వరరావు, హౌజ్ ఫెడ్ డైరెక్టర్ బలిసేని కిషన్ రావు, వాకర్స్ క్లబ్ సీనియర్ నాయకులు ఎండి రఫీ ఖాన్, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రత్యేక అధికారి ఇరిగి నర్సింగరావు, ఉప్పల్ అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ జి విజయ్ కుమార్, వంపు లక్ష్మయ్య, ఎస్ఎఫ్ఐ ఎన్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ధమాకా

- రాష్ట్రంలో ఏరులై పారిన మద్యం
- మూడు రోజుల్లో రూ.697.23 కోట్ల అమ్మకాలు
- గాంధీ జయంతి రోజునా.. మటన్, చికెన్ అమ్మకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దసరా సందర్భంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. మందు బాబులు తాగి ఊగారు. ఈ సారి దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో ప్రభుత్వం ఒక రోజు మద్యం విక్రయాలపై నిషేధం విధించింది. అయినా. అమ్మకాల్లో మాత్రం ఎక్కడా తేడా రాలేదు. గతేడాదితో పోల్చితే ఇప్పటి వరు ఏడు శాతం మద్యం విక్రయాలు పెరిగాయి. సెప్టెంబర్ 29న రూ.278 కోట్లు. 30న రూ.333 కోట్లు. అక్టోబర్ 1న రూ.86.23 కోట్లు మొత్తం 697.23 కోట్ల అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే మూడు రోజుల అమ్మకాలపై 60 నుంచి 80 శాతంగా పెరిగాయి. దసరా వేడుకల వేళ ప్రతి ఏటా మద్యం అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి. మొత్తంగా సెప్టెంబర్ మాసంలో రూ.3,048 కోట్ల అమ్మకాలు సాగాయి. గత ఏడాది సెప్టెంబర్ మాసంలో 2,838 కోట్లు అమ్మకాలు జరిగాయి. ఇందులో 29.92 లక్షల కేసుల లిక్కర్ 36.46 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. మద్యంతో పాటు కూల్ డ్రింక్స్, చికెన్, మటన్, చేపలు పెద్ద ఎత్తున అమ్ముడయ్యాయి. ఇదిలా ఉండగా గాంధీ జయంతిని రోజు మాంసం విక్రయాలు చేపట్టకూడదని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రధానంగా కార్పొరేషన్లలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేసేందుకు ప్రయత్నించినా ఫలితాలు ఇవ్వలేదు. కొన్ని షాపులు మూసేసినా, మెజారిటిగా మటన్, చికెన్, ఇతర షాపులు యధావిధిగా ఎప్పటిలాగే దసరా పండుగ రోజు చుక్క, ముక్క కొనసాగింది.

రవాణా శాఖ కమిషనర్‌గా రఘునందన్ రావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌గా ఎం.రఘునందన్ రావు గురువారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ, సహకార శాఖలతో పాటు ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్న ఆయన్ను ప్రభుత్వం తాజాగా వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా నియమించడంతో పాటు రవాణాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇక్కడ పనిచేసిన సురేంద్ర మోహన్‌ను వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శితో పాటు ప్రభుత్వ కార్యదర్శిగా నియమించింది. ఇక రవాణా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.రఘునందన్ రావును హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సి.రమేష్ కలిసి పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జెటిసిలే. టిడిసిలు, ఆర్‌డిఒలు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ఆ శాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు.


కొండారెడ్డిపల్లికి సీఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విజయదశమిని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన స్వగ్రామమైన కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డి పల్లికి గురువారం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడికి కుటుంబ సమేతంగా వెళ్లారు. అనంతరం జమ్మి కార్యక్రమం, అలయ్ బలయ్‌ను నిర్వహించారు. కాగా, కొండారెడ్డిపల్లి గ్రామానికి రూ.200 కోట్ల అభివృద్ధి పనులను చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనుల్లో.. పాలశీలీకరణ కేంద్రం, బిసి కమ్యూనిటీ హాల్, ఎస్‌సి కమిటీ హాల్, గ్రంథాలయం, గ్రామపంచాయతీ, పిల్లల ఆటస్థలం, పాఠశాల అదనపు గదులు, ఇందిరమ్మ ఇళ్లు, సోలార్ సిస్టమ్, అండర్ విద్యుత్తు, అండర్ డ్రైనేజీ, సిసి రోడ్లు, ప్లాంటేషన్ ఇలా చెప్పుకుంటూపోతే 19 రకాల కార్యక్రమాలను విజయవంతం చేశారని గ్రామస్తులు తెలిపారు. త్వరలో వంగూరు మండలంలో సమీకృత భవనాలు, 30 పడకల ఆస్పత్రి, రెండు లైన్ల రోడ్లు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్టు అధికారులు తెలిపారు. సాయంత్రం రోడ్డు మార్గాన తిరిగి కొడంగల్‌కు చేరుకున్నారు.

మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలని సిఎంకు వినతి

దసరా పండుగకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామైన కొండారెడ్డిపల్లి గ్రామానికి వచ్చి దసరా వేడుకల్లో పాల్గొని, కొడంగల్‌కు బయలుదేరిన సిఎంకు మిడ్జిల్ ప్రజలు స్వాగతం పలికారు. కాగా, మిడ్జిల్ నుంచి జడ్‌పిటిసిగా గెలుపొంది రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినందుకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల, అన్ని గ్రామాలకు,



తండాలకు, బీటీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌పి డి జానకి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, విజయ్ కుమార్, ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు బాల్‌రెడ్డి, మల్లికార్జున్, టైగర్ జంగయ్య, పెరుమళ్ల జంగయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి ఇంట దసరాఉరోత్సవం

- ప్రత్యేక అతిథిగా మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన నారాయణపురంలో దసరా వేడుకల సందర్భంగా మంత్రి కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజల ఆప్యాయతను స్ఫూర్తిగా తీసుకుని.. గ్రామస్థులతో కలిసి దసరా ఆనందాన్ని పంచుకున్నారు. స్వగ్రామంలో మంత్రి ప్రత్యేక భోజన ఏర్పాట్ల ద్వారా గ్రామ ప్రజలు, నాయకులను ఆహ్వానించి ఆప్యాయతతో కలసి భోజనం చేశారు. కుటుంబసభ్యులతో కలిసి పండుగను జరుపుకున్న మంత్రి స్థానికులకు మరింత ఆనందాన్ని పంచారు. పొంగులేటి ఆతిథ్యం స్వీకరించిన వారిలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నవరాత్రులు నిష్ఠతో, నియమాలతో ఆచరించిన ప్రజల కోరికలను అమ్మవారు తీర్చాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని, అష్టైశ్వర్యాలు, ఆరోగ్యం, సుఖసంతోషాలు ప్రతి తెలుగు ఇంటిలో వర్ధిల్లాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

బిసిల రిజర్వేషన్లపై డబుల్ డ్రామాలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసొచ్చే వారితో సర్దుబాటు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసిల రిజర్వేషన్ల విషయంలో కొందరు డబుల్ డ్రామాలాడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్‌తో కలిసి కూనంనేని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్, సిపిఎం, వామపక్షపార్టీలతో కలిసి ముందుకెళ్తామని చెప్పారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ఈ నెల 8న వెలువడనున్న కోర్టు తీర్పు ఆధారంగా, ఆ కేసులో సిపిఐ కూడా ఇంప్లీడ్ అయ్యేందుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బిసి రిజర్వేషన్ల బిల్లులు చెల్లుబాటు అవుతాయా? లేదా? అనే చర్చలు జరుగుతున్నాయనీ, ఇటీవల శాసనసభలో ఆ బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ పది శాతం రిజర్వేషన్లను పెంచడంతో రిజర్వేషన్లపైన ఉన్న 50 శాతం పరిమితి ఎప్పుడో దాటిందని తెలిపారు. రాష్ట్రంలో బలమైన జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ స్థానాలను గుర్తించి పోటీ చేసేందుకు సిద్ధమవ్వాలని తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగిన సామాజిక కార్యకర్త వాంగ్‌చుక్‌ను అరెస్ట్ చేయడమేంటని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తున్నదని విమర్శించారు. దేశ ప్రజలను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పట్ల ప్రధాని మోడీ పల్లెత్తు మాట కూడా అనడం లేదని విమర్శించారు.

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి మృతికి సిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉన్న తన నివాసంలో ఉంచారు. ఆయన భౌతికగాయాన్ని సందర్శించి సిఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందనీ, ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీని వీడలేదని వారు గుర్తు చేసుకున్నారు.

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2025-26 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 23న ఉదయం 9 గంటలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు, 24న ఉదయం 9 గంటలకు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు మొదలవుతాయి. మార్చి 24న చివరి పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జనవరి 21న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షను, 23న పర్యావరణ విద్య పరీక్షను, ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు జనరల్ కోర్సుల విద్యార్థులకు, జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు వొకేషనల్ కోర్సుల విద్యార్థులకు ప్రతి రోజు రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. సమగ్ర శిక్ష వొకేషనల్ ట్రేడ్ ఎగ్జామినేషన్ ఫిబ్రవరి 13న ఉంటుంది.



గాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళి

- శ్రద్ధాంజలి ఘటించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి, బాపు సమాధి వద్ద గురువారం గవర్నర్, సిఎం తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహాత్ముడు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గాంధీ మ్యూజియంలో ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. నివాళ్లర్పించిన వారిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, సిపి సజ్జనార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పర్యాటకశాఖ ఎండి క్రాంతి వల్లూరి, అడిషనల్ సిపి తాఫ్సీర్ ఎక్బాల్, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు

పోరాట ఫలితమే నైబర్ హుడ్ సిబ్బందికి వేతనాలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు : ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా క్రాంతి పథకం ఆధ్వర్యంలో నడుస్తున్న నైబర్ హుడ్ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) కృతజ్ఞతలు తెలిపింది. వేతనాల పెంపు, హెచ్‌ఆర్ విధానం అమలు కోసం, రెగ్యులరైజ్ చేయాలని 2024 నుండి ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన పోరాటాలు నిర్వహించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, గౌరవాధ్యక్షులు వరమ్మ, కోశాధికారి ఆర్ వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో నడుస్తున్న నైబర్‌హుడ్ సెంటర్లలో పని చేస్తున్న కార్యకర్తలు, ఎర్లీ ఇంటర్వెన్షన్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, ఆయా, రిహబిలిటేషన్ ప్రొఫెషనల్లు 225 మంది పని చేస్తున్నారని తెలిపారు. వీరు అతి తక్కువ వేతనాలతో గత 15 ఏళ్ల నుండి పని చేస్తున్నారని గుర్తు చేశారు. సెర్ప్‌లో పని చేస్తున్న అనేక మంది సిబ్బందిని గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచిందని తెలిపారు. కానీ ఎన్‌హెచ్‌సీలలో పని చేస్తున్న సిబ్బందిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఎన్‌పిఆర్‌డి, ఎన్‌హెచ్‌సి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క, సెర్ప్ సిఇఒ, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. 2025 ఫిబ్రవరి 25న సెర్ప్ సిఇఒతో జరిగిన చర్చల సందర్భంగా కార్యకర్తలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.5వేల నుండి 13,650 లకు, సిఆర్‌పిలకు రూ.5000 నుండి 13,650లకు, ఆయాలకు రూ.4000 నుండి రూ.7,800 లకు,రిహ్యాబిలిటేషన్ ప్రొఫెషనల్లకు రూ.21,000 నుండి రూ.36,000 లకు పెంచుతామని హామీ ఇచ్చారు. హామీ అమలు చేయడానికి ప్రభుత్వం కాలయాపన చేస్తుంటే 2025 జూలై 23న సెర్ప్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించామని గుర్తు చేశారు. అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతు ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు, పెంచిన వేతనాలు 2025 ఏప్రిల్ నుండి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించటం హర్షణీయమని తెలిపారు. ప్రతినెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలనీ, పెండింగ్‌లో ఉన్న పెరిగిన వేతనాలను అక్టోబర్ నెలలో ఏరియర్స్‌తో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు.

లిడ్ క్యాప్ భూముల లీజు రద్దు చేయాలి

- మంత్రి శ్రీధర్‌బాబుకు మంద కృష్ణమాదిగ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న లిడ్ క్యాప్‌కు సంబంధించిన భూములను ప్రయివేట్ కార్పొరేట్ సంస్థలకు లీజుకు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లిడ్ క్యాప్ భూములను ,ఆస్తులను పరిరక్షించాలని కోరారు. లిడ్ క్యాప్ అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, లిడ్ క్యాప్, లేదర్ వర్క్ మీద సమగ్రమైన అవగాహన కలిగిన అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించాలని కోరారు. లిడ్ క్యాప్ భూములను పెట్రోల్ బంక్, యూనిట్ మాల్ కేటాయిస్తూ ఇచ్చిన జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తన పరిధిలో ఉన్న డిమాండ్లను పరిష్కారం చేస్తానని తెలిపారు.

ఒక్క ఓటు ఉన్న బిసిలకు టికెట్ ఎలా కేటాయిస్తారు..?

- కూసుమంచి మండలం ధర్మతండాలో నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మా తండా స్థానిక సంస్థల రిజర్వేషన్ మార్చి గిరిజనులకే రిజర్వ్ చేయాలని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ధర్మ తండా గ్రామంలో గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ధర్మ తండా గ్రామపంచాయతీ బిసిలకు రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తండాలో అందరూ గిరిజనులే ఉన్నామని, ఒక్క ఓటు ఉన్న బిసికి ఎలా రిజర్వ్ చేస్తారని ప్రశ్నించారు. ఉన్న ఆ ఒక్క బీసీ వ్యక్తి కూడా వేరే ఊరిలో ఉంటున్నాడని తెలిపారు. దీన్ని తక్షణమే మార్చి లంబాడీ బిడ్డకు కేటాయించాలని, లేనిమెడల హైకోర్టుకు వెళ్లి రిజర్వేషన్ సాధిస్తామని చెప్పారు. దీనిపై స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెంటనే స్పందించి న్యాయం చేయకపోతే, ఎంపిటిసి, జడ్‌పటిసి ఎలక్షన్లు బహిష్కరిస్తామని తండావాసులు హెచ్చరించారు.

గాజా మారణహోమం ఆపండి

- అమెరికా యుద్ధోన్మాదం ప్రపంచానికి పెను ప్రమాదం
- పాలస్తీనాను స్వతంత్ర్య దేశంగా గుర్తించాలి
- వామపక్ష కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాజా మారణహోమాన్ని వెంటనే ఆపాలని, పాలస్తీనాను స్వతంత్ర్య రాజ్యంగా గుర్తించాలని వామపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గాజాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తాలో సిఐటియు, ఎఐటియుఐసి, ఎఐయుటియుసి, ఎఐసిసిటియు, టియుసిసి, యుటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, గాజా దాడులను వెంటనే ఆపాలి, పాలస్తీనాను స్వతంత్ర్య దేశంగా గుర్తించాలి అంటూ ప్ల కార్డులు, జెండాలు పట్టుకుని అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ పాలస్తీనాలోని యురేనియం, ఆయిల్ నిక్షేపాలను దోచుకునేందుకు అమెరికా ఇజ్రాయెల్‌తో కలిసి పాలస్తీనాపై మారణకాండను సృష్టిస్తోందని విమర్శించారు. గాజాపై దాడులను వ్యతిరేకిస్తున్న దేశాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అమెరికా పన్నులు విధిసోందని అన్నారు. ఇజ్రాయిల్ రెండేళ్లుగా సాగిస్తున్న యుద్ధంలో 50 వేల మందికి పైగా సాధారణ పౌరులు మరణించగా, లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, వయోవృద్ధులు అని చూడకుండా దాడులకు పాల్పడుతోందని అన్నారు. గాజాపై చేస్తున్న పైశాచిక దాడులను ఐక్యరాజ్య సమితిలోని100కు పైగా దేశాలు వ్యతిరేకిస్తున్నా ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతోందని విమర్శించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో గాజా ప్రజల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని గుర్తు చేశారు. నిలువ నీడ కరువై, తినడానికి తిండి లేక దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.. మానవతా సహాయం కోసం పంపిస్తున్న ఆహారాన్ని సైతం ఇజ్రాయిల్ సైనికులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చివరికి ఆస్పత్రులు, స్కూళ్లపైనా కూడా విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అమెరికా తన యుద్ధోన్మాదాన్ని ఆపి శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఎఐయుటియుసి నాయకులు భరత్ మాట్లాడుతూ పెట్టుబాడిదారి సమాజం తన లాభాల కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తుందని లెనిన్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యాలయ్యాయని అభిప్రాయపడ్డారు. అమెరికా తన వ్యాపార ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్‌ను పావుగా ఉపయోగించుకుని గాజాపై మారణకాండను కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్షులు మహబూబ్ యూసఫ్, తెలంగాణ ఆఫ్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ సీనియర్ నాయకులు ఎంఎన్.రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, పద్మశ్రీ, రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శి కె రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి సుధాకర్, ఎఐటియుసి రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నర్సింహా, సిఐటియు హైదరాబాద్ సౌత్ ఎం. శ్రావణ్‌కుమార్, సెంట్రల్ సిటీ నాయకులు రాములు, నరేష్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



బిందెలతో నీళ్లు మోసుకెళుతున్న గ్రామస్తులు

పండగపూట నీటి తిప్పలు

- కామారెడ్డి జిల్లా అక్కంపల్లి గ్రామంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం అక్కంపల్లి గ్రామంలో గురువారం పండగపూ ట గ్రామస్తులు నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో వాటర్ ట్యాంక్ ఉంది. దానికి సంబంధించి రెండు బోర్లు ఉన్నాయి. ఒక బోర్ మోటార్ కాలిపోయింది. ఇంకో బోర్ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో ట్యాంక్‌లోకి నీరు రాలేదు. మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న నీరు రంగు మారి రావడంతో పండుగ పూట గ్రామస్తులకు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులు గ్రామస్తులకు కావాల్సిన సదుపాయాలు కల్పించకపోవడంతో పంట పొలాల నుంచి నీరు తెచ్చుకొని పండగ జరుపుకోవాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు తెలిపారు. తరచూ గ్రామంలో నీటి సమస్య ఏర్పడుతుందని శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.



వాట్సప్‌లో బుకింగ్.. ఆన్‌లైన్‌లో పేమెంట్స్

- డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు అరెస్టు
- టాస్క్‌ఫోర్సు అదనపు డిసిపి వైవిఎస్ సుధీంద్ర వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసులకు చిక్కకుండా ప్రధాన డ్రగ్స్ డీలర్ చెప్పిన విధంగా వాట్సాప్‌లో డ్రగ్స్ బుకింగ్‌లు, ఆన్‌లైన్‌లో పేమెంట్స్‌ను తీసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను నార్కోటెక్ ఎన్‌ఫోర్సుమెంట్ (హెచ్‌ఎన్‌ఈడబ్ల్యూ) వింగ్ అరెస్టు చేసింది. నిందితుల నుంచి 50 గ్రాముల ఎండిఎంఎ, రూ.830 నగదుతోపాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు అదనపు డిసిపి వైవిఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడకు చెందిన మొహమ్మద్ ఉస్మాన్ అలియాజ్ అబ్బు, కర్నాటకకు చెందిన రాహుల్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. 10వ తరగతి వరకు చదువుకున్న ఉస్మాన్ బేబీ స్టోర్‌లో చేరాడు. అయితే ఆ వ్యాపారంలో నష్టాలు రావడంతో యజమాని షోరూంను క్లోజ్ చేశాడు. దాంతో ఉస్మాన్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తగా సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కేరళకు చెందిన డ్రగ్స్ సప్లయర్ అశ్విన్‌తో పరిచయం ఏర్పడింది. బెహరాన్‌లో ఉన్న అశ్విన్ ఆదేశాలతో ఉస్మాన్‌తోపాటు రాహుల్ కూడా డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నాడు. బెహరాన్ నుంచే వాట్సాప్‌లో డ్రగ్స్ బుక్ చేస్తున్న అశ్విన్.. ఉస్మాన్, రాహుల్‌కు గ్రాముకు రూ.రెండు వేలు తీసుకునేవాడు. అశ్విన్ పంపించిన ఎండిఎంఎ డ్రగ్స్‌ను రిసీవ్ చేసుకుంటున్న ఇద్దరు నిందితులు హైదరాబాద్‌లో రూ.8000 నుంచి రూ.10,000కు విక్రయిస్తూ, ఆన్‌లైన్‌లో పేమెంట్స్ తీసుకుంటున్నారు. పక్కా సమాచారం అందుకున్న నార్కోటెక్ ఎన్‌ఫోర్సుమెంట్ బృందం ఇద్దరు నిందితులను చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. పరారీలో ఉన్న అశ్విన్ కోసం గాలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఇడబ్ల్యు ఇన్‌స్పెక్టర్ డ్యానియేల్, ఎస్ఐ సి వెంకట రాములుతోపాటు చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్‌ఒ బ్రాహ్మమురారీ కాశిని, ఎస్ఐ క్రిష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'అలయ్ బలయ్'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అలయ్ బలయ్ లాంటి కార్యక్రమాలు సోదరభావాన్ని పెంపొందిస్తాయని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్‌మేఘ్‌వాల్, జి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, బిజెపి ఎంపిలు డాక్టర్ కె లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే సుజనాచౌదరి, మాజీ ఎంపి వి హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య, అరుణోదయ విమల, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ప్రముఖ సినీనటులు నాగార్జున, పద్మశ్రీ బ్రహ్మానందం తదితరులు హాజరయ్యారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా అలయ్ బలయ్‌ను దత్తాత్రేయ ప్రారంభించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాయకుల మధ్య ఐక్యత కోసం అలయ్ బలయ్ తోడ్పడిందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ అంశంతో ఈ ఏడాది అలయ్‌బలయ్‌ను నిర్వహించారు. ఇది కుల, మతాలకతీతంగా ప్రజలంతా ఒక్కటే అనే సందేశమిస్తుందని ప్రముఖులు ప్రశంసించారు. దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి తండ్రి ఆలోచనలను కొనసాగిస్తున్నదని అభినందించారు.



చిన్నారులు ఆలపిస్తున్న పాటలను వింటున్న ప్రముఖులు

సోదరభావాన్ని పెంపొందించే సాంస్కృతిక ఉత్సవం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం

సోదరభావాన్ని పెంపొందించే వేడుక అలయ్ బలయ్ అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము తెలిపారు. ఈ మేరకు రాష్ట్రపతి శుక్రవారం సందేశం పంపించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రతి ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహభరితంగా నిర్వహించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కళా ప్రదర్శనలు...

అలయ్‌బలయ్ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే వివిధ కళ ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. . ఈ సందర్భంగా తోలుబొమ్మలాట, బైండ్ల కథలు, కొమ్ము కోయలు, ఆదివాసీ గిరిజన నృత్యం గుస్సాడీ, గంగిరెద్దులు, ఒగ్గుడోలు, కొమ్ము డ్యాన్సులు, పెద్దబండోళ్లు, బేడ-బుడగ జంగాల కథ, పులి వేషాధారణ, డప్పు నృత్యాలు, బతుకమ్మలు, పోతురాజుల విన్యాసం, తప్పెట గుళ్లు, మల్లన్న స్వామి, రాజన్న డోలు, కేరళ డ్రమ్ముల ప్రదర్శన తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ రకాల తెలంగాణ సంప్రదాయ వంటకాలతో కూడిన ఆతిథ్యాన్ని ఆహూతులు స్వీకరించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేశంకు సతీవియోగం

- రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ భార్య సుమిత్రిబాయి (60) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం 42వ వార్డులోని వారి నివాసం వద్ద ఉంచిన ఆమె మతదేహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పూలమాలలేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, సుమిత్రిబాయి మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో.. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పట్టణం వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డా. మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు. కాగా, సుమిత్రిబాయి మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సాగర్ 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు వస్తున్న వరద నీటిని గేట్లను ఐదడుగుల మేరకు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి నాగార్జున సాగర్‌కు 2,61,176 క్యూసెక్కుల నీరు వస్తుండగా సాగర్ జలాశయం నుంచి 2,56,244 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను ఐదడుగుల మేరకు ఎత్తి 2,02,956 క్యూసెక్కుల నీటిని దిగునకు విడుదల చేస్తున్నారు.

సాగర్ జలాశయం నుండి కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 33,211 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 587.20 అడుగుల నీటిమట్టం ఉంది.



మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- బీజాపూర్‌లో 103 మంది లొంగుబాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు పార్టీకి సమ్మెట దెబ్బలు నానాటికి అధికమవుతున్నాయి. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఏకంగా 103 మంది మావోయిస్టులు ఒక్కసారే లొంగిపోవడం ఆపార్టీకి కోలుకోలేని ఎదురు దెబ్బని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజాపూర్ జిల్లా ఎస్పి జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2026 మార్చి నెలాఖరు వరకు మావోయిస్టు పార్టీని పూర్తిగా అంతమొందిస్తామన్న నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతపై పూర్తిగా కేంద్రీకరించి బలగాలతో గాలింపుచర్యలు ముమ్మరం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యాలను భద్రతా బలగాలు రోజూ జల్లెడ పట్టడం పేరిట పచ్చటి అడవుల్లో నెత్తుటి ఏర్లు పారిస్తున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు అనేకమార్లు ఎన్‌కౌంటర్లు జరిగాయి. దాంతో కింద స్థాయి గ్రామ కమిటీల నుంచి ఏరియా కమిటీ, కమాండర్ స్థాయి వరకూ లొంగుబాటు వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలిపారు. 'నాయాద్ నల్ల ఇరికె' 'లోన్ వరాట్'తో పాటు వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్ల వల్ల మావోయిస్టు పార్టీ సభ్యులు దండకారణ్యాన్ని వదిలి అభివృద్ధి కోసం ఆత్మసంరక్షణ బాటలో పడ్డారని అన్నారు. ఇప్పటివరకు 410 మంది లొంగుపోయారని, 421 మంది అరెస్టు చేసినట్టు, 37 మంది ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్టు చెప్పారు. కాగా, లొంగిపోయిన 103 మందిలో 49మందిపై నూ.1.06 కోట్ల రివార్డు ఉంది. లొంగిపోయిన మావోయిస్టులకు ఆయా జిల్లాల పోలీస్ అధికారులు ప్రోత్సాహకాన్ని అందించడంతో పాటు సదుపాయాలు కల్పిస్తున్నారు.

పెదనాన్న వేధింపులకు బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దనాన్న వేధింపులను తట్టుకోలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. పేట్ బషీరాబాద్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి పోచమ్మ గడ్డలోని ఓ ఇంట్లో అనురాధ తన ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఆమె భర్త గతేడాది చనిపోయారు. అతను చనిపోయే ముందు తన అన్న శ్రీనుతో కలిసి ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి అప్పు తీసుకున్నట్టు తెలిసింది. అయితే అతను చనిపోయాక ఆ కుటుంబాన్ని శ్రీను వేధిస్తున్నాడు. ఇంటిని ఖాళీ చేయాలని పదేపదే దుర్భాషలాడుతూ అవమానపరుస్తూ ఇబ్బంది పెడుతున్నాడు. ఇటీవల ఆమె కుమార్తె పింకీ (17) ఇంట్లో ఒంటరిగా ఉండగా శ్రీను వచ్చి అవమానపరిచాడు. దాంతో మనస్తాపానికి గురైన బాలిక.. సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని చనిపోయింది. విషయం తెలుసుకున్న తల్లి అనురాధ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక రాసిన లేఖలో 'సొంత తమ్ముడిని చంపిన నాకు మీరెంత' అని శ్రీను బెదిరించినట్టు పేర్కొనడం గమనార్హం.

పెద్దపల్లి ఒసిపి-3లో పండగ పూట విషాదం

- షావల్ బోల్తాపడి కార్మికునికి తీవ్రగాయాలు
- హైదరాబాద్ ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దసరా పండుగనాడు సింగరేణిలో విషాదం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లాలోని సింగరేణి ఆర్జీ-2 ఒసిపి-3లో షావల్ బోల్తా పడి కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. గురువారం 2వ బదిలీలో ఇ లక్ష్మినారాయణ అనే ఇపి ఆపరేటర్ నడుపుతున్న ప్రగతి షావల్ ఫైర్ కూల్ వద్ద పొగ ఎక్కువగా ఉండటంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కార్మికుని మెడ, తల లోపలి భాగంలో తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన సింగరేణి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒమేగా ఆస్పత్రికి తరలించారు. పండగ పూట కార్మికులందరూ సంతోషంగా గడుపుతున్న సమయంలో ప్రమాదం జరగడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

రక్షణా చర్యల వైఫల్యమే ప్రమాదానికి కారణమా..

రక్షణా చర్యల వైఫల్యం మూలంగానే ప్రమాదం జరిగినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. పని ప్రదేశంలో ఫేస్ సరిగ్గా చేయాల్సిన డోజర్లు అందుబాటులో లేక ఇరుకుగా మారి కోల్ ఫైర్ అయ్యి దట్టమైన పొగ వచ్చి కనపడకనే షావల్ అదుపు తప్పి ప్రమాదానికి గురయింది. దాదాపుగా 20 డోజర్లతో ఫేస్ సరి చేయాల్సిన పనిని మూడు డోజర్లు పెట్టి పనులు చేపిస్తుండటం, పనుల్లో యాజమాన్యం అలసత్వం వహించడం కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. జనరేటర్ సదుపాయం లేక, లైటింగ్ రాక.. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని కార్మికులు, కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.



దుర్గమాత పూజలో కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నివాసంలో దసరా పండుగ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తమ నివాసంలో జరిగిన పూజా కార్యక్రమంలో కెసిఆర్ దంపతులు, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెసిఆర్, కెటిఆర్ దుర్గామాతకు పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కెసిఆర్‌కు మాజీ హోం మంత్రి మెహమూద్ అలీ.. దసరా శుభాకాంక్షలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- జగ్గారెడ్డి సంచలన నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడేండ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి తాను పోటీ చేయనని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన ప్రకటన చేశారు. దసరా పండుగ ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఇంకో పదేండ్ల వరకు తాను ఎన్నికల్లో పోటీ చేయనని తెలిపారు. సంగారెడ్డి ఎమ్మెల్యేగా మూడు సార్లు తనను గెలిపిస్తే నియోజకవర్గం కోసం ఏం చేయాలో అది చేశానన్నారు. ఐఐటీ హైదరాబాద్, ఇంటింటికి తాగునీరు, వ్యవసాయ యూనివర్శిటీ తీసుకువచ్చానని అన్నారు. మూడేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన సతీమణి, టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల బరిలో ఉంటారని ప్రకటించారు. ఆ తర్వాత పార్టీ కోసం కష్టకాలంలో పని చేసిన చేర్యాల ఆంజనేయులు లాంటి వారికి కూడా అవకాశాలు రావాలన్నారు. పదేళ్ల తర్వాత మాత్రం తానే పోటీ చేస్తానని వెల్లడించారు. సంగారెడ్డి అభివృద్ధే తమ లక్ష్యమని చెప్పారు. అలాగే, కూన సంతోష్ వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి అని ఏదైనా అవసరం ఉంటే పనుల కోసం సంతోష్‌ను కలవాలని పట్టణ ప్రజలకు సూచించారు.

యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడవద్దు..

యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి తమ విలువైన ప్రాణాలను కోల్పోవద్దని జగ్గారెడ్డి సూచించారు. అతి వేగంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులను క్షోభకు గురిచేయొద్దని తెలిపారు. తన కుమారుడు దత్తురెడ్డిని వేదికపైనే హెచ్చరించారు. వాహనంలో ప్రయాణించే సమయంలో 70 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో పోవద్దని సూచించారు. తమ పిల్లలు ఇబ్బందులు పడుతుంటే తల్లిదండ్రులు మానసిక వ్యధను అనుభవిస్తారని తల్లిదండ్రులను పిల్లలు మంచిగా చూసుకోవాలని సూచించారు. కాగా, పట్టణంలోని రాంమందిర్ నుంచి అంబేద్కర్ మైదానం వరకు శ్రీరాముని విగ్రహాలను (చావా) ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ వేడుకల్లో టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి మున్సిపాలిటీ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి వసూళ్ల వృద్ధిలో అట్టడుగు స్థానం

- కాంగ్రెస్ సర్కారుపై ట్వీట్‌లో కెటిఆర్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఎస్‌టి వసూళ్ల వృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అట్టడుగు స్థానంలో ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఆర్థిక విధ్వంసానికి ఇవే ఆనవాళ్లు అంటూ ట్వీట్ చేశారు. సెప్టెంబర్ 2025లో వస్తు,సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్ల వృద్ధి రేటులో దేశంలోనే అట్టడుగున తెలంగాణ ఉండటం దారుణమని తెలిపారు. రెండేళ్ల క్రితం, కెసిఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని గుర్తు చేశారు. రేవంత్ పరిపాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక సూచిక ఇదేనని పేర్కొన్నారు.

రిజర్వేషన్లతో రివర్స్

- వెనుకబడిన వర్గాలు లేని తండాల్లో బిసి రిజర్వేషన్
- బిసిలు అధికంగా ఉన్నచోట ఎస్‌టిలకు కేటాయింపు
- ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతర రిజర్వేషన్‌లపై అభ్యంతరాలు
- రిజర్వేషన్ల పుణ్యమా అని అనేక చోట్ల ఏకగ్రీవాలకు చాన్స్
- ఆశావహులు అత్యధికుల్లో నిస్తేజం
- జనరల్ కేటగిరికి గణనీయంగా తగ్గిన స్థానాలు
- మంత్రులు, ఎమ్మెల్యేలపై అనుచరుల ఒత్తిడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు గందరగోళానికి దారితీస్తున్నాయి. వెనుకబడిన వర్గానికి చెందిన ఓటర్ ఒక్కరూ లేని తండాల్లో సర్పంచ్ స్థానాన్ని బిసికి రిజర్వ్ చేశారు. ఎస్‌టిలు లేనిచోట ఎస్‌టిలకు కేటాయించారు. ఒకటి, రెండు చోట్ల వంద శాతం బిసిలు ఉండగా ఆ గ్రామాన్ని ఎస్‌టికి రిజర్వ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరులకు రిజర్వ్ చేయొద్దనే నిబంధన ఉన్నా ఎస్‌టియేతరులకు కేటాయించటం విమర్శలకు చోటిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో జడ్‌పటిసి, ఎంపిపి, ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలను గిరిజనులకే రిజర్వేషన్ చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) డిమాండ్ చేస్తోంది. రిజర్వేషన్ల పుణ్యమా అని అనేక మంది ఆశావహుల భవితవ్యాలు తారుమారయ్యాయి.

ఎప్పటి నుంచో పోటీ చేయాలని తగిన గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్న వారిలో ఇప్పుడు అయోమయ స్థితి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై 8వ తేదీన వెలువడే హైకోర్టు తీర్పు కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆరోజు సందిగ్ధత వీడి ఎన్నికలు జరిగే పరిస్థితి ఉంటే రిజర్వేషన్లపై పలువురు కోర్టుకు వెళ్లే ఆలోచనలోనూ ఉన్నారు. రిజర్వేషన్లు సవరించేలా చర్యలు చేపట్టాలని మంత్రులు, ఎమ్మెల్యేలపై కొందరు ఆశావహులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలనే ప్రభుత్వ యోచన మంచిదే అయినా ప్రణాళిక లేమితో కేటాయింపులు ఉండటం విమర్శలకు తావిస్తోంది.

ప్రణాళిక లేని రొటేషన్ పద్ధతే కారణం

ప్రణాళిక లేని రొటేషన్ పద్ధతి కారణంగానే సంబంధిత వర్గానికి చెందిన అభ్యర్థులు లేని చోట ఆ వర్గానికి కేటాయింపులు జరిగాయనే విమర్శలు వస్తున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల కోసం 2011 జనాభా లెక్కలను, బిసి రిజర్వేషన్ల కోసం 2024 కులగణన సర్వే లెక్కలను పరిగణనలోకి తీసుకున్నారు. సర్పంచ్ ఎన్నికల కోసం 2018 నాటి రిజర్వేషన్లను ప్రామాణికంగా తీసుకుని రొటేషన్ పద్ధతిని అనుసరించటం వల్ల కొన్నిచోట్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో ఆయా గ్రామాల్లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి కుటుంబాలు వలసపోవటం కూడా కారణంగా చూపుతున్నారు. పదేండ్ల క్రితం నాటి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవటం, రొటేషన్ పద్ధతి అమలు చేయటం వల్ల ఇలాంటి గందరగోళ స్థితి నెలకొందని భావిస్తున్నారు. జిల్లాకో తీరుగా.. రెవెన్యూ డివిజన్‌కో తీరుగా కేటాయింపులు చేయటం వల్లనే ఇలాంటి చిత్రవిచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని గ్రామీణ ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అధికారుల తిలోదకాలు!

రిజర్వేషన్ల ఖరారులో అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎస్‌సి, ఎస్‌టిలకు గతంలో మాదిరిగానే స్థానాలను నిర్ధారించాలని ప్రభుత్వం సూచించింది. బిసిలకు మాత్రం 42శాతం రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జడ్‌పి చైర్మన్ స్థానాలకు పంచాయతీరాజ్ కమిషనర్, జడ్‌పిటిసి, ఎంపిపి స్థానాలకు జిల్లా కలెక్టర్లు, ఎంపిటిసి, సర్పంచ్‌లకు ఆర్‌డిఒలు, వార్డుమెంబర్ల స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన నిర్ణయించాలో కూడా ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. జనాభా దామాషా ప్రకారం ఎస్‌టి, ఎస్‌సి బిసి, మహిళా స్థానాలను ఖరారు చేయాల్సి ఉంది. సాధారణంగా సగం కంటే ఎక్కువ ఏ జనాభా ఉంటే ఆ వర్గానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. షెడ్యూల్డ్ ఏరియాలో ఎస్‌టి ఎస్‌టిలకు మొత్తం స్థానాల్లో సగానికి తగ్గకుండా చూడాలి. వందశాతం ఎస్‌టి జనాభా ఉంటే మొత్తంగా వారికే కేటాయించాలి. కానీ అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు జరిగినట్టు తెలుస్తోంది. అందుకే ఆశావహులు అభ్యంతరాలు తెలుపుతున్నారు. గణనీయంగా జనరల్ స్థానాలు తగ్గటంతో ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ఆశావహులు తిరుగుతున్నారు. రిజర్వేషన్‌లో మార్పు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. కొన్నిచోట్ల ఆందోళనలు సైతం చేపడుతున్నారు. పోటీపై తీవ్ర ఆసక్తితో ఉన్న కొందరు రిజర్వేషన్ల కారణంగా సర్పంచ్‌కు బదులు ఎంపిటిసిగా పోటీ చేయాలని, అది కూడా వీలుకాకపోతే మండల పరిధిలో వీలైన చోట ఎంపిటిసికి పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 8వ తేదీ కోర్టు తీర్పును బట్టి నిర్ణయం తీసుకోవాలని.. అవసరమైతే కోర్టును సైతం ఆశ్రయించాలని నిశ్చయించుకున్నట్టు పలువురు చెబుతున్నారు. రిజర్వేషన్లు తారుమారవటంతో రాష్ట్రంలో అనేక స్థానాలు ఏకగ్రీవం అయ్యే చాన్స్ ఉందని అంటున్నారు.



రిజర్వేషన్ల గందరగోళంపై మచ్చుకు కొన్ని..

+ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో 37 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 13 బిసిలకు కేటాయించారు. 95శాతం పైగా ఎస్‌టి జనాభా ఉన్న పది పంచాయతీలను బిసిలకు కేటాయించటం విమర్శలకు తావిస్తోంది. ఒక్క బిసి కూడా లేని నాగబోయిన వెంకయ్య బంజర (ఎన్‌వీ బంజర) గ్రామ సర్పంచ్ స్థానాన్ని బిసి మహిళకు రిజర్వ్ చేయటం గమనార్హం. 15 ఏండ్ల క్రితం ఈ గ్రామంలో ఒక్క బిసి మహిళ ఉండేది. ఆమె ఊరు నుంచి వలస వెళ్లింది. ఇక ఇదే మండలంలో ఒకటి, రెండు బిసి ఓట్లు ఉన్న అనేక తండాలను కూడా బిసిలకు రిజర్వ్ చేశారు. మంగ్యాతండా, పుఠాని తండా, సూర్యాతండా, బద్యాతండా, చెరువుకొమ్ము తండా, రాములుతండాల్లో ఈ పరిస్థితి ఉంది. మండలకేంద్రం రఘునాథపాలెంలో 43.53శాతం బిసిలున్నా ఎస్‌టికి కేటాయించటం గమనార్హం.

- వరంగల్ జిల్లా సంగెం మండలం వంజరపల్లె గ్రామంలో 373 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒక్కరూ ఎస్‌టి లేకున్నా షెడ్యూల్ ట్రైబ్‌కు కేటాయించటంపై గ్రామస్తులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.
- ఆదిలాబాద్ రూరల్ మండలం చిట్యాలబోరిలో మొత్తం గిరిజనులే ఉండగా ఆ స్థానం బిసికి రిజర్వ్ అయింది. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మెట్‌పల్లి గ్రామంలో మొత్తం ఎస్‌సిలే ఉండగా బిసికి కేటాయించారు. ఇవి కొన్ని మాత్రమే ఇలా వందలాది పంచాయతీలు, ఎంపిటిసి స్థానాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి.

బిసిలు లేకున్నా రిజర్వ్ చేశారు.. :
భూక్యా నవీన్, ఎన్‌వీ బంజర

మా గ్రామంలో ఒక్క బిసి లేరు. కానీ మా ఊరు సర్పంచ్ స్థానాన్ని బిసి మహిళకు కేటాయించారు. నేను సిపిఎం అభ్యర్థిగా మా పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేయాలనే సంకల్పంతో ఉన్నా. ఎస్‌టికి రిజర్వ్ అయితే మా పార్టీ గ్రామశాఖ కూడా నన్ను అభ్యర్థిగా పెట్టాలని అనుకుంది.